

లక్నవరంలో ఏర్పాటు చేసిన రిసార్ట్

# వాటర్ స్పోర్ట్స్.. అడ్వెంచర్ గేమ్స్

- లక్నవరంలో అందుబాటులోకి 3వ ఐలాండ్
- పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు
- ఐదు స్విమ్మింగ్ పూల్స్.. 22 ప్రీమియం రూమ్స్
- నూతన శోభతో మినీ బీచ్ సౌకర్యం

గోవిందరావుపేట, అక్టోబర్ 26 : ప్రకృతి అందాలకు మారుపేరుగా నిలిచిన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సులో పర్యాటకుల సౌకర్యార్థం అధికారులు మరో ఐలాండ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటకులను ఆకర్షించే విధంగా 'దికోవ్' పేరుతో నూతన రిసార్టును ఏర్పాటు చేశారు. అద్భుతమైన సౌకర్యాలతో పర్యాటకులకు వసతితో పాటు పసందైన భోజనం, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్స్ గేమ్స్ వంటి సౌకర్యాలతో పాటు ఐదు స్విమ్మింగ్ పూల్స్, 22 ప్రీమియం రూమ్‌లను నిర్మించారు. 50 మంది సామర్థ్యంతో అధునాతనమైన రెస్టారెంట్‌ను సైతం ఏర్పాటు చేశారు. సరస్సు కట్టమీది నుంచి కాకర కాయల బోర్డు తీగల వంతెన మీదుగా చేరుకున్న అనంతరం 2వ ఐలాండ్‌కు పర్యాటకులను చేర్చేందుకు నూతన బోట్లను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్కడి నుంచి నూతనంగా నిర్మించిన తీగల వంతెన మీదుగా 3వ ఐలాండ్‌కు చేరుకునే ఏర్పాట్లు చేశారు. అందమైన ప్రకృతికి తోడు చుట్టూ నీళ్లు, బోటు షికారు, ఐలాండ్‌లో వసతితో పాటు చిన్నారులు, పెద్దల కోసం నాలుగు స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఐలాండ్‌లో ఉన్న రూములకు అనుసంధానంగా మరో



రూమ్‌కు అటాచ్‌గా ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్

పెద్ద స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించారు. కేరళ, లక్షద్వీప్, బాలీలాంటి పర్యాటక ప్రాంతాలను పోలిన విధంగా పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఫ్రీకౌట్స్ సంస్థ 'దికోవ్' పేరుతో రిసార్టును లీజ్ పద్ధతిలో అందుబాటులోకి తీసుకొచ్చింది.

**పర్యావరణ హిత టూరిజంగా..**

పర్యాటకులను ఆకర్షించేలా 3వ ఐలాండ్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. పర్యావరణ హిత టూరిజంగా అభివృద్ధి చేసే దిశగా 'దికోవ్' రిసార్ట్ ముస్తాబైంది. స్విమ్మింగ్ పూల్స్, జిప్‌లైన్ వంటి అడ్వెంచర్ గేమ్స్, వాటర్ స్పోర్ట్స్, క్యాంపెయిన్‌తో పాటు నూతన శోభతో మినీ బీచ్ ఏర్పాటు చేశారు. పర్యాటకులు సూర్యోదయం, సూర్యాస్తమయాలను వీక్షించేందుకు వీలుగా వ్యూ పాయింట్‌ను తీర్చిదిద్దారు. పర్యాటకులు సరదాగా చేపలను వేటాడేందుకు సౌకర్యాలు కల్పించారు. అలాగే సైక్లింగ్ బోటింగ్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. పార్టీలు, ప్రీ వెడ్డింగ్ షూట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు లక్నవరం రిసార్ట్ నూతన ఆకర్షణగా మారనున్నది.



నీటి మధ్యలో ఏర్పాటు చేసిన కాటేజ్‌లు



రామప్పలో శిక్షణ పొందిన వలంటీర్స్‌తో అధికారులు



సమావేశంలో మాట్లడుతున్న కలెక్టర్ దివాకర

# వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

- ములుగు కలెక్టర్ దివాకర
- రామప్పలో ముగిసిన క్యాంపెయిన్
- వలంటీర్లకు సర్టిఫికెట్ల అందజేత

వెంకటాపూర్, అక్టోబర్ 26 : వలంటీర్స్ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య అన్నారు. శనివారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్పలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం శాఖ, భారత పురావస్తు శాఖ, ఐకోమస్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన వరల్డ్ హెరిటేజ్ వలంటీర్, యువ టూరిజం క్లబ్ సభ్యుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్ దివాకర, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్స్ శిక్షణలో నేర్చుకున్న విషయాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేయడంతో పాటు, చారిత్రక, వారసత్వ కట్టడాల పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాండురంగారావును, వలంటీర్స్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రావు, యువ టూరిజం క్లబ్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ టూరిజం ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా టూరిజం అధికారి శివాజీ, కేంద్ర పురావస్తు డిప్యూటీ సూపరింటెండెంట్, సీఏ మల్లేశ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, బాబు, టూరిజం గైడ్స్, టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



కాకతీయ క్రానికల్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

# కేఎంసీ భవిష్యత్ బంగారుమయం

- క్రితి రీసెర్చ్ డే తో మంచి గుర్తింపు
- కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం
- ముగిసిన రీసెర్చ్ డే వేడుకలు

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 26: కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ) భవిష్యత్ బంగారుమయంగా మారుతుందనడంతో ఎలాంటి అనుమానం లేదని ఐఎంఏ ఎథికల్ కమిటీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ శేషుమాధవ్, కాకతీయ రీసెర్చ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్నోవేషన్స్ (క్రితి)–24 కన్వీనర్ డాక్టర్ సుజిత్ ఆర్ పున్నం అన్నారు. శనివారం నిర్వహించిన క్రితి–24 ముగింపు వేడుకలను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న వైద్యవిద్యార్థుల ఆలోచనలను పంచుకోవడానికి ఏర్పాటు చేసిన ఈ రీసెర్చ్ డే వేడుకలు కళాశాలకు దేశవ్యాప్త గుర్తింపును తీసుకువచ్చాయన్నారు. ఈ సందర్భంగా దేశంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ ఇచ్చిపుచ్చుకోవడమనే విధానంతో ముడిపెట్టి జ్ఞాన పరంపరను పెంపొందించుకోవడం కోసం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. ఏపీపీఐ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ కత్తుల, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్‌లు నిర్వాహక కమిటీని, పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ విభాగాధిపతులు, వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 నుంచి మేడారం మినీ జాతర



మినీ జాతర తేదీలను ప్రకటిస్తున్న పూజారులు

నాలుగు రోజుల పాటు నిర్వహణ

తేదీలు ఖరారు చేసిన పూజారులు

తాడ్వాయి, అక్టోబర్26 : వచ్చే ఏడాది 2025లో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర (మండె మెలిగే పండగ) తేదీలను శనివారం అమ్మవార్ల పూజారులు ఖరారు చేశారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల పూజారులు అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం మినీ జాతర తేదీలపై పెద్దలతో కలిసి చర్చించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు జాతరను నిర్వహించేందుకు నిర్ణయించారు. మినీ జాతరను పురస్కరించుకొని అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురావడం మినహా మహాజాతరలో నిర్వహించినట్లుగానే పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు. పూజారులు కొక్కెర కృష్ణయ్య, భోజారావు, కాక సారయ్య, కిరణ్, రమేశ్, అరుణ్‌కుమార్, అమృతమ్మ పాల్గొన్నారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, పక్కన మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి

ప్రశ్నించే గొంతుకలపై పగ సాధింపు

# రాష్ట్రంలో దుర్మార్గపు పాలన

- పోలీస్‌స్టేషన్లా.. కాంగ్రెస్ కార్యాలయాలా?
- శ్రీనునాయక్ ఆత్మహత్య బాధాకరం
- శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ
- కాంగ్రెస్ తొత్తులుగా పనిచేస్తున్న పోలీసులు
- నియోజకవర్గంలో హత్యా రాజకీయాలు
- మాజీ మంత్రులు సత్యవతి, ఎర్రబెల్లి
- రేవంత్‌రెడ్డి కాదు కమీషన్‌రెడ్డి
- మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ
- పాలకుర్తిలో శ్రీను ఆత్మహత్యకు నిరసనగా ఎల్‌హెచ్‌పీఎస్, బీఆర్‌ఎస్ మహాధర్నా

పాలకుర్తి, అక్టోబర్ 26 : సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తున్నదని, ప్రశ్నించే గొంతుకలపై పగ సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాకు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరికొండ మాట్లాడుతూ పది నెలల్లో రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని, సీఎం పదవి అంటే తిట్టడమే పనిగా ఉందన్నారు. రాష్ట్రంలో పోలీస్‌స్టేషన్లు అంటే కాంగ్రెస్ కార్యాలయాలుగా పని చేస్తున్నాయని, ఇది తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో చెబుతున్నానన్నారు. పోలీసులు కాంగ్రెస్ నాయకుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాడని, రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డి మాయ మాటలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ధ్వజమెత్తారు. పాలకుర్తి, తొర్రూరు ప్రాంతాలు నీళ్లు లేక ఎండిపోయాయన్నారు. గోదావరి జలాలతో కరువు నేలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని ప్రశంసించారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నాయకత్వంలో పాలకుర్తి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శ్రీను నాయక్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. శ్రీను నాయక్ కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. శ్రీను నాయక్ మృతికి కారణమైన కాంగ్రెస్ నాయకుడిపై హత్య కేసు నమోదు చేసి పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని సిరికొండ డిమాండ్ చేశారు.



పోలీస్ స్టేషన్ ఎదుట భారీగా మోహరించిన పోలీస్ బలగాలు

## పోలీసులు తీరు మార్చుకోవాలి

–మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న శ్రీను నాయక్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పది నెలల నుంచి పాలకుర్తి నియోజకవర్గంలో హత్యా రాజకీయాలు కొనసాగుతున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా రాష్ట్రానికి హోం, విద్య, గిరిజనశాఖలకు మంత్రులు లేరని, మంత్రి వర్గ విస్తరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నదని, రెండేళ్లలో తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాబోతున్నదని ఎర్రబెల్లి జోస్యం చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకతను కప్పి పుచ్చుకునేందుకే కాంగ్రెస్ మంత్రులు, నాయకులు డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ మంత్రులు ఏ తప్పు చేయలేదని, కాళేశ్వరం, ఫోన్ ట్యాంపింగ్ వంటి కేసులకు భయపడేది లేదని, ఈడీలు.. బోడీలు లేవని.. ఏ తప్పు చేసినా శిక్షించుకోవచ్చని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ మంత్రులు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. గిరిజన యువకుడు శ్రీనునాయక్‌కు మద్దతు తెలిపినందుకే కొన్ని డిజిటల్ పత్రికల్లో తనపై తప్పుడు రాతలు రాయిస్తున్నారని.. తనకేం కాదన్నారు. రేవంత్‌రెడ్డి హయాంలో పోలీసులను ఇబ్బంది పెడుతున్నారని, రెండేళ్లలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రాబోతున్నదన్నారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడని.. ఆయన హయాంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని, గ్రామాలను అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడని.. తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా తనను గెలిపించిన పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకుంటా.. ఓడిపోయినా ప్రజల మధ్యనే ఉంటున్నా.. ఏ ఆపద వచ్చినా గద్ద లెక్క వాలుతా.. అండగా ఉంటానని దయాకర్‌రావు అన్నారు. శ్రీను నాయక్ మరణ వాంగ్మూలంలో తన చావుకు ఎస్సై, సీఐ, కాంగ్రెస్ నాయకులే కారణమని చెప్పినా పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే శ్రీను నాయక్ ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటూ ఆదుకుంటానని చెప్పారు. పాలకుర్తి నియోజక వర్గంలో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా ముందుంటానన్నారు. పోలీసు అధికారులు పద్ధతి మార్చుకోవాలని, కాంగ్రెస్‌కు తొత్తులుగా పని చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ పాలనలో పోలీసులకు అనేక సౌకర్యాలు కల్పించామన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో పోలీసుల భార్యలే ధర్నాలు చేస్తున్నారన్నారు.

## తరలివచ్చిన శ్రేణులు, గిరిజనులు

లకావత్ శ్రీను ఆత్మహత్యకు నిరసనగా శనివారం ఎల్‌హెచ్‌పీఎస్, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా ధర్నాకు బీఆర్‌ఎస్ శ్రేణులు, నియోజకవర్గ గిరిజనులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తొలుత సిరికొండ మధుసూదనాచారి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, తాటికొండ రాజయ్య కొండాపురం శివారు మేకలతండాలో లకావత్ శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. అక్కడి నుంచి నేరుగా పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మహా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వందలాది మందితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కేసు పురోగతిపై చర్చలు జరిపారు. శ్రీను మృతికి కారణమైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని, కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయాలని కోరారు. జనగామ డీసీపీ రాజ మహేంద్రనాయక్, వర్ధన్నపేట, జనగామ ఏసీపీలు అంబటి నర్సయ్య, పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధరావత్ మోహన్ గాంధీనాయక్, జర్పుల బాలునాయక్, గుగులోతు రాజేశ్‌నాయక్, బానోత్ మహేందర్‌నాయక్, ధరావత్ రాంసింగ్ నాయక్, కాలునాయక్, ధరావత్ యాకూబ్‌నాయక్, ధరావత్ జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు పల్లా సుందర్ రామిరెడ్డి, నల్లా నాగిరెడ్డి, పుస్కూరి శ్రీనివాసరావు, పసునూరి నవీన్, తీగల దయాకర్, వసుమర్తి సీతారాములు, పేరం రాము, సింద రామోజీ, బస్వ మల్లేశం, మంగళంపల్లి శ్రీనివాస్, రంగుకుమార్, జినుగు అనిమిరెడ్డి, పాము శ్రీనివాస్, మాచర్ల ఎల్లయ్య, ఈదూరు ఐలయ్య, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, వీరమళ్ల రాజు శ్రీను కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ధర్నాకు హాజరైన పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు

## మార్పు రాలేదు.. మరణాలు వచ్చాయి..

–మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



సీఎం రేవంత్‌రెడ్డిది అసమర్థ పాలన అని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మండిపడ్డారు. రాష్ట్రానికి హోంమంత్రి లేడని, పాలనలో మార్పు రాలేదు కానీ.. మరణాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ తొత్తులుగా పని చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నదన్నారు. మైనర్ బాలికపై సాక్షాత్తు ఓ సీఐ లైంగిక వేధింపులకు పాల్పడితే జిల్లాలోని మహిళా మంత్రులు ఏం చేస్తున్నారని, సీఐపై ఎందుకు కేసు పెట్టడం లేదని ప్రశ్నించారు. గిరిజన యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటే జిల్లాలో ఉన్న గిరిజన మంత్రి ఏం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రుణమాఫీ, రైతు బంధు రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30సార్లు ఢిల్లీకి పోయాడని ఎద్దేవా చేశారు. శ్రీను మృతికి కారణమైన రాజకీయ నాయకుడిని శిక్షించాలన్నారు. శ్రీను కుటుంబానికి న్యాయం జరగని పక్షంలో మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. గిరిజన విద్యార్థి ప్రీతి ఆత్మహత్య చేసుకుంటే బీఆర్‌ఎస్ మంత్రి వర్గం అండగా నిలిచిందని గుర్తు చేశారు. జీవో 29ని వెంటనే రద్దు చేయాలని సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు.

## రేవంత్‌రెడ్డిది రాక్షస పాలన

–మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ



రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాదని, కమీషన్‌రెడ్డి అని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. అతడిది రాక్షస పాలన అని మండిపడ్డారు. మూసీ పేరుతో సీఎం రేవంత్ రూ. 1.50 లక్షల కోట్ల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. డబ్బు మూటలను రాహుల్‌గాంధీకి పంపుతున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ పాలన గాలికి వదిలేసి కమీషన్ల కోసం ఆరాటపడుతున్నాడన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలతో మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి విలాసాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. శ్రీను నాయక్ ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ, పోలీసుల హత్యేనన్నారు. శ్రీను నాయక్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

# వైద్యులకు మెమోలు

- 'గర్భిణికి అందని వైద్యం'పై ఉన్నతాధికారుల స్పందన
- వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రిలో విచారణ

వర్ధన్నపేట, అక్టోబర్ 26 : ప్రసూతి కోసం వచ్చిన గర్భిణీకి వైద్యం అందించని వర్ధన్నపేట ఆస్పత్రిలోని ముగ్గురు వైద్యులు, ఇద్దరు నర్సులకు ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు. గురువారం అర్ధరాత్రి తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన నాగమణి పురుటి నొప్పులతో ఆస్పత్రికి రాగా, వైద్య పరీక్షలు చేయకుండా వరంగల్ సీకేఎం దవాఖానకు పంపించారు. దీంతో మార్గమధ్యంలోనే 108 వాహనంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈ విషయమై 'గర్భిణికి అందని వైద్యం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మ రహస్యంగా వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రిని సందర్శించి విచారణ జరిపారు. అనంతరం వైద్యులు ప్రావీణ్య, విక్రమ్, పూర్ణిమతో పాటు ఇద్దరు నర్సులకు మెమోలు జారీ చేశారు. కాగా, ఆస్పత్రిలో వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మామునూరులోని 4వ బెటాలియన్ ఎదుట ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్లు

# 4వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల నిరసన

**వెట్టి చాకిరీ చేయిస్తున్నారని యూనిఫామ్‌తో ఆందోళన**

కరీమాబాద్, అక్టోబర్ 26 : విధుల పేరుతో వెట్టి చాకిరి చేయిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ వరంగల్ జిల్లా మామునూరులోని 4వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు శనివారం నిరసన చేపట్టారు. మొదటగా బెటాలియన్‌లోని కమాండెంట్ కార్యాలయం ఎదుట ఏక్ పోలీస్ ఆకారంలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివచ్చి బెటాలియన్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ఆందోళనకు దిగారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. లా అండ్ ఆర్డర్ విధుల్లో తమ సేవలు వినియోగించుకోవాలని, తమకు సంబంధం లేని పనులు చేయించొద్దని కోరారు. ఇటీవల కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు ధర్నా చేసిన విషయం ప్రజల్లో చర్చ జరుగుతున్న సమయంలోనే రాష్ట్రంలో మొదటిసారిగా కానిస్టేబుళ్లు యూనిఫాం ధరించి నిరసన చేపట్టడం అటు హోంశాఖతో పాటు ఇటు ప్రజల్లో తీవ్ర చర్చగా మారింది. తమకు న్యాయం చేయాలని, న్యాయమైన కోరికలను తీర్చాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం చేస్తున్న సిబ్బందితో కమాండెంట్ రాంప్రకాష్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడారు. కానిస్టేబుళ్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా వాయిదా వేశారు. హామీలు అమలు చేయడంలో ఇబ్బందులు సృష్టిస్తే తిరిగి పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు.

# అరుదైన క్లబ్‌లోకి ఇండియన్ చెస్ ప్లేయర్ అర్జున్



హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26 : లైవ్ రేటింగ్స్‌లో యూరోపియన్ చెస్ క్లబ్ 2800 క్లబ్‌లోకి హనుమకొండకు చెందిన చెస్ ప్లేయర్ అర్జున్ ప్రవేశించారు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ మార్కును దాటిన రెండో భారతీయుడిగా రికార్డులకెక్కారు. ప్రపంచంలోని 16 మంది మాత్రమే ఈ మార్క్‌ను టచ్ చేశారు. ఈ సందర్భంగా అర్జున్‌ను నెటిజన్లు, తల్లిదండ్రులు అభినందించారు.


